సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- పోలీస్ అకాడమీలో ప్రీ ప్రమోషనల్ శిక్షణ ప్రారంభం

శిక్షణలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): పోలీసు సిబ్బంది ఆర్థిక ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి (ఆర్బీవీఆర్ఆర్) తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో మంగళవారం ప్రీ ప్రమోషనల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను మంచి రాబడి వచ్చే రంగాల్లో పెట్టుబడి పెట్టాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆర్బీవీఆర్ఆర్, టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్ట్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు.

కుప్పకూలిన నిర్మాణరంగం

మొదటిపేజీ తరువాయి...

అధికారిక లెక్కలను పరిశీలించినా నిర్మాణరంగం క్రమంగా కుదేలవుతున్నదనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి. రియల్ఎస్టేట్, నిర్మాణ రంగాలంటేనే శివారు ప్రాంతాలు. అలాంటిది రెండేండ్లతో పోలిస్తే చుట్టూ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణ అనుమతుల్లో భారీ తగ్గుదల నమోదుకావడం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతున్నది. 2019లో ఈ రెండు రంగాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత అనూహ్యంగా కొవిడ్‌తో లావాదేవీలు, క్రయవిక్రయాలు కాస్త మందగించాయే కానీ భారీ తగ్గుదల నమోదు కాలేదు. అందుకే కొవిడ్ సమయంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణ రంగానికి లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సి వచ్చింది. కొవిడ్ అనేది రెండు రంగాలకు ఒక స్పీడ్ బ్రేకర్‌గా మాత్రమే మారింది. కానీ, దూకుడును తగ్గించలేకపోయింది. నగరం చుట్టూ ఉన్న స్థానిక సంస్థల పరిధిలో 2021, 2022 సంవత్సరాల్లో అనుమతుల సంఖ్యను చూస్తే ఇదే విషయం అర్థమవుతుంది. ప్రధానంగా 2021 నుంచి 2022కు అనుమతులు 22% మేర పెరిగాయి.

పడిపోతున్న అనుమతులు

రాష్ట్రంలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 ఆదిలో రియల్ ఎస్టేట్–నిర్మాణ రంగాల్లో కొంత మేర స్తబ్ధత నెలకొన్నా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ ఇలాగే ఉంటుందని నిపుణులు సైతం అనుకున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత హైదరాబాద్ రియల్ఎస్టేట్ నిర్మాణ రంగాలు ఊపందుకుంటాయని చెప్పారు. హైడ్రా దూకుడుగా నిర్మాణాల కూల్చివేత చేపట్టడంతో రేపో మాపో కోలుకుంటుందనుకున్న రియల్ ఎస్టేట్–నిర్మాణ రంగాల్లో అదే స్తబ్ధత కొనసాగడంతోపాటు తగ్గుదల మొదలైంది. 2023తో పోలిస్తే 2024లో 16 స్థానిక సంస్థల పరిధిలో అనుమతులు ఏకంగా 36% తగ్గాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. దాని ఫలితంగానే రియల్టర్లు, బిల్డర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. దాని పర్యవసానంగానే నిర్మాణ రంగంలో ఆత్మహత్యలు చోటుచేసుకోవడం దురదృష్టకరం.

మున్సిపాలిటీ	2022	2023	2024
ఆదిభట్ల	141	192	294
ఆమనగల్	68	70	65
బడంగ్‌పేట్	3,335	3,605	1,320
బండ్లగూడ జాగీర్	1,248	1,321	1,147
ఇబ్రహీంపట్నం	240	166	110
జల్‌పల్లి	97	166	116
కొత్తూరు	34	31	24
మణికొండ	86	843	263
మీర్‌పేట్	1,119	358	388
నార్సింగి	152	186	193
పెద్దఅంబర్‌పేట్	245	,097	790
షాద్‌నగర్	697	609	250
శంషాబాద్	24	74	43
శంకర్‌పల్లి	367	343	212
తుక్కుగూడ	168	112	114
తుర్కయాంజాల్	363	1,627	1,620

'ఇందిరమ్మ' గైడ్‌లైన్స్‌పై కాలయాపన

- నగరాలు, పట్టణాల్లో లక్షల దరఖాస్తులు పెండింగ్
- సొంత జాగాలు లేనివారు 90% పైనే

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇంతవరకు జారీ చేయలేదు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి గ్రేటర్ హైదరాబాద్‌లోని 25 నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని 40 అర్బన్ నియోజకవర్గాల్లో పేదల నుంచి దాదాపు 82 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మార్గదర్శకాలు లేకపోవడంతో వాటిని పెండింగ్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలి దశలో జాగా ఉన్నవారికే ఇల్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు ఇంటిని పొందే అర్హత కోల్పోతున్నారు. మురికివాడల్లో నివసిస్తున్న పేదల్లో ఎక్కువ శాతం మందికి సొంత జాగాలు లేవు. వారంతా అనాదిగా ప్రభుత్వ భూముల్లోనే గుడిసెలు, కచ్చా ఇండ్లు నిర్మించుకొని కాలం వెళ్లదీస్తున్నారు. చాలా కాలం నుంచి వారు అక్కడే ఉంటుండడంతో కరెంట్, నల్లా కనెక్షన్లు మంజూరయ్యాయి. కానీ, ఇండ్ల పట్టాలు గానీ, ఆయా జాగాలపై యాజమాన్య హక్కులు సూచించే ధ్రువపత్రాలు గానీ లేవు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 10 లక్షల మందిలో 90% మందికి సొంత జాగాలు లేవు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర పట్టణాల్లో సైతం ఇంచుమించు ఇదే పరిస్థితి ఉన్నది. దీంతో వారంతా ఇందిరమ్మ ఇల్లు పొందే అర్హత కోల్పోయినట్టే.

పట్టణాల్లో రెండు విధాలుగా ఇండ్ల నిర్మాణం

ప్రభుత్వ జాగాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇవ్వ డం ఒక విధానమైతే, ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశం నుంచి పేదలను ఖాళీ చేయించి అదేచోట అపార్ట్‌మెంటు నిర్మించి అందరికీ కేటాయించడం మరో విధానం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జియాగూడ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఈ విధంగానే అపార్ట్‌మెంట్లు నిర్మించి లబ్ధిదారులకు అందించింది. ఇతర మురికివాడల్లో నివసిస్తున్నవారికి ప్రభు త్వ జాగాలు ఉన్నచోట డబుల్ బెడ్రూ మ్ ఇండ్లను నిర్మించి ఇచ్చింది. ఇలా గ్రేటర్ హైదరాబాద్‌లోని లక్ష పేద కుటుంబాలకు ఇండ్లను సమకూర్చింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాగాలు లేవనే కారణంతో పట్టణ పేదలకు ఇండ్లను మంజూరు చేయకుండా, కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తున్నది.

స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు 30 వేలు లంచం

ధారూరు, ఫిబ్రవరి 11 : లంచం తీసుకుంటూ వికారాబాద్ జిల్లా ధారూరు ఎస్సై మంగళవారం ఏసీబీకి చిక్కాడు. ధారూరు మండలం నాగసముందర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తన ప్రైవేటు డ్రైవర్ బీరప్ప ద్వారా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు మంగళవారం రూ.30 వేలు లంచం ఇవ్వగా ఏసీబీ అధికారులు ఎస్సైని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పరీక్షల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్, టెన్త్ పరీక్షలు ముగిసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్‌తో కలిసి ఎలక్షన్ కమిషన్ సంయుక్త కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

కుంభమేళాకు వెళ్లివస్తూ.. ఏడుగురు దుర్మరణం

మొదటిపేజీ తరువాయి...

బస్సు నుజ్జునుజ్జయ్యింది. ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. బస్సులో ఇరుక్కుపోయిన మరో ఆరుగురిని స్థానికులు బయటకు తీసి జబల్‌పూర్ మెడికల్ కాలేజీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మినీ బస్సు వెనుక ఓ కారు కూడా ప్రమాదానికి గురైనప్పటికీ అందులో ఉన్నవారు సురక్షితంగా బయటపడినట్టు ఏఎస్పీ సూర్యకాంత్ శర్మ తెలిపారు.

నాచారంలో విషాదఛాయలు

ఈ ఘటన మృతులంతా నాచారంలోని రాఘవేంద్రనగర్, కార్తికేయ నగర్‌కు చెందినవారు. మంగళవారం తెల్లవారుజామునే బయలుదేరుతామని కుటుంబసభ్యులకు చెప్పారు. ఉదయాన్నే ప్రమాదవార్త తెలియడంతో రోదనలు మిన్నంటాయి. మృతుల్లో నవీన్, బాలకృష్ణ, సంతోష్, శశికాంత్, రవి, ఆనంద్ ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్టు మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణలో లోపాలు

- కొన్ని కులాలకు తీవ్ర అన్యాయం
- లోపాలు సవరించి న్యాయం చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వర్గీకరణపై చర్చిస్తున్న మంద కృష్ణమాదిగ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం ఆయన భేటీ అయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను చిత్తశుద్ధితో చేపట్టినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, సీఎంకు ఒక సోదరుడిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వర్గీకరణలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. అసెంబ్లీలో చర్చించి, క్యాబినెట్ సబ్ కమిటీ, న్యాయ కమిషన్లను నియమించి, నివేదికలపై క్యాబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని తెలిపారు. లోపాలు, అభ్యంతరాలను క్యాబినెట్ సబ్ కమిటీతోపాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం సూచనల మేరకు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మందకృష్ణ చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయని స్పష్టంచేశారు. కొన్ని కులాలకు అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రధానంగా వెనుకబడిన మాదిగ కులానికి అన్యాయం జరిగిందని తెలిపారు. 'గ్రూప్ బీ'కి కేటాయించిన రిజర్వేషన్లను 9 నుంచి 11 శాతానికి పెంచాలని కోరినట్టు వివరించారు. ఎక్కువ జనాభా ఉన్న నేత కానీలను మాలలున్న సీ గ్రూప్‌లో వేయడం వల్ల వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. జనాభా తక్కువగా ఉన్న కొన్ని కులాలను మొదటి గ్రూప్‌లో చేర్చి ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారని, అదే సమయంలో ఎక్కువ మంది ఉన్న బేడ బుడగ జంగాలను అత్యధికంగా వెనుకబడిన ఏ గ్రూపులో వేశారని తెలిపారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాలలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లు కేటాయించారని మండిపడ్డారు. వీటితోపాటు పలు అంశాలను సీఎంతోపాటు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి వివరించినట్టు చెప్పారు.

మహిళా పోలీసులు 4,782 మందే

ఇచ్చినట్టు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఒక ప్రకటనలో వెల్లడించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్‌శాఖలో అన్ని విభాగాల్లో మొత్తం 76,292 మంది అధికారులు, సిబ్బంది ఉండగా, వీరిలో మహిళా అధికారులు, సిబ్బంది 4,782 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఎస్సీ నుంచి డీజీ స్థాయి వరకు 67 మంది, కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు 3,642 మంది, ఏఆర్‌లో 1,073 మంది ఉన్నారు. మరో 868 మంది హోంగార్డులుగా ఉన్నారు. సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు పోలీస్‌శాఖ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం

ఎస్సార్ విజయకేతనం..

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 11: జేఈఈ ఫలితాల్లో ఎస్సార్ విద్యా సంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లాల నాగసిద్ధార్థ(ఫిజిక్స్‌లో 99.97 పర్సంటైల్) సాధించి ఎస్సార్ కీర్తిప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టినట్టు చెప్పారు. తాడిపర్తి తేజస్ ఉద్భవ్ రెడ్డి(99.83), మారం రాజవర్షిత్‌రెడ్డి (99.81), దిడ్డి ప్రజ్వల్‌కుమార్ (99.77), యాద భరణిశంకర్ (99.77), చల్లా అన్విక(99.66), మేడ కార్తీక్ (99.66), జోగు అభిరాం (99.60), కడారి సంజయ్ (99.58), చిన్ని కమలావర్ధన్(99.58)తోపాటు మొత్తం 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్టు వివరించారు. విద్యార్థుల తోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

పారిశుధ్య పనులు మెరుగ్గా చేయాలి

కార్పొరేషన్, ఫిబ్రవరి 11 : నగరపాలక సంస్థలో విలీనమైన చింతకుంట గ్రామంలో పారిశుధ్య పనులు మెరుగ్గా చేయాలని కమిషనర్ చాహత్ భాజ్ పాయ్ పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం విలీన గ్రామమైన చింతకుంట పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజూ పిన్ పాయింట్ పద్ధతిని అమలు చేసి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని, ఉదయం కార్మికుల హాజరును బయోమెట్రిక్ పద్ధతిలో సేకరించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళేబరాలను పూడ్చిన అధికారులు

కార్పొరేషన్, ఫిబ్రవరి 11 : నగరంలోని ఆటో నగర్‌లో ఇటీవల గుర్తించిన పశు కళేబరాలను మంగళవారం నగరపాలక అధికారులు పూడ్చివేశారు. ఇటీవల ఈ ప్రాంతంలో కొందరు వ్యక్తులు పశు కళేబరాలను ఒకే ప్రాంతంతో వేయడం వల్ల తీవ్ర దుర్వాసన వస్తుందని ఫిర్యాదులు రావడంతో వాటిని నగరపాలక అధికారులు పరిశీలించారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మంగళవారం ఆ కళేబరాలను పూడ్చి వేశారు.

రోడ్లపై చెత్తను వేసిన వారిపై జరిమానా

కార్పొరేషన్, ఫిబ్రవరి 11 : నగరంలోని ఫారెస్ట్ చౌరస్తా సమీపంలో పండ్ల షాపుల యజమానులు రోడ్లపై చెత్త వేయటాన్ని గుర్తించిన అధికారులు మంగళవారం ఆయా యజమానులకు జరిమానా విధించారు. తమ షాపుల్లోని చెత్తను చెత్త వాహనాలకు అందించకుండా రోడ్లపై వేస్తున్న ఏడుగురిని గుర్తించి రూ.500 చొప్పున జరిమానాలు విధించారు. జరిమానాలు విధించడం జరుగుతుందని పర్యావరణ ఇంజనీర్ స్వామి తెలిపారు.

విద్యార్థినికి అభినందన

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని బీకాం తృతీయ సంవత్సర ఎన్‌సీసీ విద్యార్థిని శ్వేత ఇటీవల ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో తెలంగాణ తొమ్మిదో బెటాలియన్ నుంచి పాల్గొంది. మంగళవారం కళాశాలలో ఆ విద్యార్థినిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జేవీ రాజిరెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కన్జర్ల శ్రీలత, డాక్టర్ ఈ స్రవంతి, డాక్టర్ నల్ల మనోజ్ కుమార్, డాక్టర్ బి రజినీ దేవి, డాక్టర్ ఏం కల్పన ఉన్నారు.

అంగట్లో ప్రజాపాలన దరఖాస్తులు



జిరాక్స్ సెంటర్‌లో నిర్లక్ష్యంగా పడేసిన దరఖాస్తులు

గంగాధర, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ పథకాల కోసం ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రజలు సమర్పించిన దరఖాస్తు ఫారాలు గంగాధరలోని ఓ జిరాక్స్ సెంటర్‌లో దర్శనమిచ్చాయి. ప్రభుత్వం నాలుగు గ్యారంటీల అమలు కోసం గత నెల గ్రామాల్లో అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. ఇందులో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని కాసారం గ్రామానికి చెందిన దరఖాస్తులు మండల కేంద్రంలోని ఓ జిరాక్స్ సెంటర్‌లో కనిపించాయి. నిర్వాహకుడు దరఖాస్తులను నిర్లక్ష్యంగా పడేయడంతో అక్కడికి వచ్చిన ప్రజలు అధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులను బయటి వ్యక్తులకు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్చిలోగా పనులు పూర్తి చేయాలి

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్, ఫిబ్రవరి 11 : స్మార్ట్‌సిటీ పథకం ద్వారా నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులన్నీ మార్చి చివరి నాటికి పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ చాహత్ భాజ్ పాయ్ ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రెండు ప్రాజెక్టుల పనులు కూడా త్వరగా ప్రారంభించాలని, ఇప్పటి వరకు పూర్తైన ప్రాజెక్టులకు వర్క్ స్లిప్ ఆర్డర్ పెట్టి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్‌సిటీ ప్రారంభం నుంచి మార్చి వరకు ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన డీటేల్డ్ రిపోర్ట్ అందించాలని ఆదేశించారు. వచ్చే బోర్డు మీటింగ్ వరకు పూర్తి స్థాయి వివరాలను సిద్ధం చేయాలన్నారు. డిజిటల్ లైబ్రరీ, బాలసదన్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ భవనాలు, కశ్మీర్ గడ్డ సమీకృత మార్కెట్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ పనులను ప్రజారోగ్య శాఖ సమన్వయంతో ప్రారంభించి హౌజ్ సర్వే కనెక్షన్స్ చేస్తూ ఎస్టీపీకి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.నగరంలోని పద్మనగర్ జంక్షన్ సుందరీకరణ పనులను వెంటనే ప్రారంభించి వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ యాదగిరి, డీఈ ఓం ప్రకాశ్, లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, సతీష్, పీఎంసీ అధికారి సందీప్ పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరుపై డీఎంహెచ్‌వో అసంతృప్తి

పేషంట్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అడుగుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన సిబ్బంది పనితీరుపై డీఎంహెచ్‌వో వెంకటరమణ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, దవాఖానలోని ప్రసూతి వార్డుతో సహా పలువార్డులు, సెంట్రల్ డ్రగ్ స్టోర్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్లు, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, సూపరింటెండెంట్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్ రావు, ఏవో డాక్టర్ నారాయణరెడ్డి, ఇతర వైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఇక్కడి నుంచి పైదవాఖానకు వెళ్లే ప్రతి రోగి ఆర్ఎంఓ అనుమతితోనే వెళ్లాలని, 24 గంటలు ఆర్ఎంవో దవాఖానలో డ్యూటీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యామ్ నాయక్ ఉన్నారు.

ఫోర్‌మెన్ కమిటీ సందర్శన

హుజూరాబాద్ ప్రాంతీయ దవాఖానలో జరుగుతున్న ఘటనలపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఫోర్‌మెన్ కమిటీ మంగళవారం విచారణ చేపట్టింది. ఈ కమిటీలో కరీంనగర్ సివిల్ దవాఖాన ఆర్ఎంవో డాక్టర్ నవీన, డాక్టర్ రవి ప్రవీణ్‌రెడ్డి, ఏవో అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ ఉన్నారు. ప్రభుత్వ దవాఖానలోని పలు రికార్డులను పరిశీలించి, విచారణలో పూర్తి పారదర్శకతతో వ్యవహరించి నిజాలను నిగ్గు తేలుస్తామని, కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

పీహెచ్‌సీలో తనిఖీ

సైదాపూర్, ఫిబ్రవరి 11 : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌వో వెంకటరమణ తనిఖీ చేశారు. నార్మల్ డెలివరీలను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మాత సంరక్షణ, మలేరియా, వ్యాధి నిరోధక టీకాలు, టీబీ, హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

ఎల్ ఐసీ ఉద్యోగుల ధర్నా

వినతిపత్రం ఇస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

విద్యానగర్, ఫిబ్రవరి 11 : ఎల్ఐసీలో వెంటనే క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ కేడర్లలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, అలాగే ఎమర్జెన్సీ టైంలో రద్దు చేసిన యూనియన్ గుర్తింపును పునరుద్ధరించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వామన్ రావు డిమాండ్ చేశారు. ఈ రెండు డిమాండ్ల సాధన కోసం జాతీయస్థాయిలో యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డివిజనల్ మేనేజర్ నారాయణకు మెమోరాండం అందజేశారు. ధర్నాలో డివిజనల్ నాయకులు సూర్యకళ, బసవేశ్వర్ అనుపమ శ్రీలత, డీవో యూనిట్ నాయకులు మహేష్ ప్రభాకరిచిరి, బ్రాంచ్ వన్ నాయకులు డీ శీనివాస్, బీ శ్రీనివాస్‌తోపాటు డివిజనల్ ఆఫీస్ బ్రాంచ్ వన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేల మీద పడిపోయింది

హుజూరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుడు పత్తి కృష్ణారెడ్డి వీడియో వైరల్

హుజూరాబాద్, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గంలో నేల మీద పడిపోయిందని ఆ పార్టీ నాయకుడు పత్తి కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో కృష్ణారెడ్డి ఏమి మాట్లాడారంటే.. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు అంటూ రెండు వర్గాలుగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విడిపోయారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చాలా దారుణంగా తయారైందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు భయపడుతున్నారని తెలిపారు. డబ్బులు ఖర్చు పెట్టినా ఓడిపోతామేమో అని టెన్షన్ పడుతున్నారని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వాళ్లు ఓడిపోతే, ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఏది ఏమైనా నియోజవర్గంలో ఏటికి ఎదురీదురుతున్నట్లు కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కుమ్మక్కయ్యారని. కాంగ్రెస్ నాయకులు ఆరోపించిన నేపథ్యంలో ఈ వీడియో రిలీజ్ చేయడం చర్చకు దారి తీసింది.

అభివృద్ధి ముందుకు సాగేనా ?

జనరల్ ఫండ్ పనులే రూ.26 కోట్లు

కార్పొరేషన్, ఫిబ్రవరి 6 : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల ప్రారంభించిన అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సీఎం అక్యూరెన్స్ నిధులు రూ.132 కోట్లతో చేపట్టిన అనేక పనులు మధ్యలోనే ఆగి ఉన్నాయి. వీటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గతేడాది కాలంగా మాజీ పాలకవర్గ సభ్యులు ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నారు. దీనిపై అ